

### బాబోయ్.. కాపర్ దొంగలు

పొలాల్లో కాపర్ వైర్ చోరీ చేసి రైతులకు తీరని నష్టం మిగుల్చుతున్న కొందరు దొంగలు రైతుల చేతికి చిక్కారు. గ్రామస్థులంతా ఏకమై వారిని పట్టుకున్నారు. - 8లో



### అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపినట్లు ఎస్పీ హర్షవర్ధన్ అన్నారు. పులివెందుల, వేంపల్లెలో ఆయన పర్యటించారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
37.8 /26.2

### వాతావరణం

జిల్లాలో మంగళవారం 26.2 నుంచి 37.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.99 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం బీఏ స్పెషల్ ఇంగ్లీషు (మేజర్) గ్రూప్‌లో సీట్లు భర్తీ కానందున రెండోదశ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. సలీంబాషా తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థినులు ఏపీ ఓఏఎండీసీ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### నిత్యాన్నదానానికి విరాళం



ఆలయ అధికారికి చెక్కు అందజేస్తున్న కృష్ణమోహన్‌రెడ్డి

చక్రాయపేట: గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి మంగళవారం రూ.1,01,116లు విరాళంగా వచ్చినట్లు ఆలయ సహాయకమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణం మోడంపల్లెకు చెందిన కృష్ణమోహన్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో వచ్చి విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారని వివరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి పాల్గొన్నారు.

### ఐక్యూఏసీ బృందానికి ప్రశంసలు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం ఇంటర్నల్ క్వాలిటీ అసెస్‌మెంట్ సెల్ (ఐక్యూఏసీ) బృందాన్ని వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి అభినందించారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ తాజాగా విడుదల చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) -2024లో యోగివేమన విశ్వవిద్యాలయానికి 51 నుంచి 100 లోపు ర్యాంకు సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఐక్యూఏసీ సంచాలకులు ఎల్.సుబ్రహ్మణ్యం శర్మ, కమిటీ ప్రతినిధులు సుభోష్ చంద్ర, కట్టా వెంకటేశ్వర్లు, డాక్టర్ డి. విజయలక్ష్మీ, రియాజున్నీసా, లక్ష్మీప్రసాద్, దాక్షాయణి కృషిని వీసీ కొనియాడారు.

### గెస్ట్ లెక్చరర్ పోస్టుకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగంలో అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులకు ఈనెల 19న ఇంటర్వ్యూ, డెమో నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా తెలిపారు. ఆంగ్లమాధ్యమంలో బోధించేందుకు ఎంఎస్సీ జువాలజీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఏపీ సెట్, నెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థినులు 19వ తేదీ ఉదయం 11 గంటలకు జువాలజీ విభాగంలో నిర్వహించే ఇంటర్వ్యూకు బయోడేటా, సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

### 20న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం ఈనెల 20వ తేదిన ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరగనుందని జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

**కారుణ్య నియామకాలు**

జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాల కోసం మంగళవారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని ఏఓ భాస్కర్‌రెడ్డి నిర్వహించారు. తొమ్మిది మంది అభ్యర్థులకుగాను ఏడుగురు హాజరయ్యారు. వీరికి త్వరలో పోస్టింగ్‌లు ఇవ్వనున్నట్లు జెడ్పీ అధికారులు తెలిపారు.

### పంద్రాగస్టుకు ఖైదీల విడుదల లేనట్లే !

కడప అర్బన్: ఈ సారి పంద్రాగస్టుకు ఖైదీల విడుదల లేనట్లే అని తెలుస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఖైదీల విడుదల ఉండదని, గాంధీ జయంతి రోజున విడుదల చేస్తామని ఇటీవల ఓ సమావేశంలో రాష్ట్ర హోంశాఖా మంత్రి అనిత స్పష్టం చేశారు. కాగా కడప కేంద్ర కారాగారం నుంచి ఖైదీలు విడుదలకు సంబంధించి మూడు విడతలుగా వివిధ కేటగిరీలకు చెందిన 20 మంది జాబితాను హోంశాఖ వారికి, జైళ్ల శాఖ వారికి ప్రతిపాదనలు పంపించారు.


### హుండీ ఆదాయం లెక్కింపు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట కోదండరామస్వామి దేవాలయం నెలవారి ఆదాయాన్ని మంగళవారం టీటీడీ డిప్యూటీ ఏఓ నటేష్ బాబు ఆధ్వర్యంలో లెక్కింపు చేశారు. ఈ సందర్భంగా హుండీ లెక్కింపు ముగిసే సమయానికి రూ. 6, 85,500లు వచ్చినట్లు తెలిపారు. ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య తదితరులు పాల్గొన్నారు.

# బడిబస్సు.. తీస్తోంది ఆయుష్షు

- కండీషన్ లేని బస్సుల్లో విద్యార్థులను తరలిస్తున్న యాజమాన్యాలు
- పిల్లల ప్రాణాలను గాల్లో దీపంలా మార్చిన వైనం..
- చోద్యం చూస్తున్న రవాణా శాఖ

**అరిగిపోయిన టైర్లు.. ఊడొచ్చేలా స్టీరింగు.. పని చేయని క్లచ్‌లు.. తరచూ ఫెయిలయ్యే బ్రేకులు... డ్రైవర్‌కు లైసెన్సు ఉండదు.. బస్సుకా ఫిట్‌నెస్ సర్టిఫికెటూ ఉండదు.. అసలే కాలం చెల్లిన బస్సులు.. ఆపై రాష్ డ్రైవింగు.. ఇదీ స్కూల్ బస్సుల పరిస్థితి. తనిఖీ చేయాల్సిన అధికారులేమో మామూళ్ల మత్తులో ఉంటారు.. పాఠశాలల యాజమాన్యాలేమో ఫీజుల వసూళ్ల వరకే ఆలోచిస్తారు.. వెరసి చిన్నారుల ప్రాణాలు గాల్లో దీపాల్లా మారాయి. గాడి తప్పిన బడి బస్సులు చిన్నారుల బంగారు భవిష్యత్తును రోడ్డుపాలు చేస్తున్నాయి. పిల్లల ఆయుష్షును మొగ్గలోనే చిదిమేస్తున్నాయి.**




కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని పాఠశాల యాజమాన్యాలు పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. ఫిట్‌నెస్ లేని బస్సుల్లోనే విద్యార్థులను తరలిస్తూ చిన్నారుల ప్రాణాలను గాల్లో దీపంలా మార్చాయి. జిల్లాలో 1132 విద్యా సంస్థల బస్సులు ఉండగా ఇందులో 816 బస్సులు ఎఫ్‌సీ కాగా 256 బస్సులు ఎఫ్‌సీకి నోచుకోలేదు. వీటిలో చాలా వరకు కాలం చెల్లినవి..కండీషన్‌లో లేని బస్సులే ఉన్నాయి. ఇలా కండీషన్‌లో లేని బస్సులు నడుపుతున్నా.. నిబంధనలు పాటించకున్నా రవాణా శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు. దీంతో స్కూల్ బస్సులు తరచూ బోల్తా పడుతున్నాయి.

- ఈ ఏడాది వల్లూరులోని ఓ పాఠశాల బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లి మండలం జీవీ పురంలో ఈ నెల 6న బ్రేకులు ఫెయిల్ అయి పక్కనే ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది.
- తాజాగా అన్నమయ్య జిల్లా ఓబుళవారిపల్లె మండలం చిన్న ఓరంపాడు వద్ద అయ్యలరాజుపల్లె ప్రైవేట్ స్కూల్ బస్సు అదుపు తప్పి రోడ్డు ప్రక్కన్న డివైడర్‌ను ఢీకొని వంకలో బోల్తా పడింది, ఈ ప్రమాదంలో భవిష్య అనే విద్యార్థిని మృతి చెందింది. వీటన్నింటికి ప్రధాన కారణం పాఠశాల బస్సులు కండీషన్‌లో లేకపోవడమే. రవాణా కార్యాలయ సిబ్బందితో అనుకూలంగా దళారులు బస్సులను ఎఫ్‌సీ చేయించి పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

**పరిమితికి మించి వేగం..**

నగర, పట్టణ ప్రాంతాలలో పాఠశాల బస్సులు 30 నుంచి 40 వరకు స్పీడ్ పరిమితి ఉండగా డ్రైవర్లు అస్సలు పాటించడం లేదు. పైగా పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తూ నిర్లక్ష్యంగా అధిక వేగంతో నడుతున్నారు.



ఇటీవల వల్లూరు సమీపంలో బోల్తా పడ్డ స్కూల్ బస్సు (ఫైల్)

**జిల్లాలో ప్రత్యేక బృందాలతో తనిఖీలు**

జిల్లాలో విద్యా సంస్థల బస్సుల తనిఖీల కోసం ఏడు ప్రత్యేక బృందాలతో మంగళవారం నిఘా ఉంచి దాడులు చేశారు. పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న 20బస్సులపై, పన్ను చెల్లించకుండా తిరుగుతున్న ఆరు బస్సులపై, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా బస్సులను నడుపుతున్నవారిపై కేసులను నమోదు చేశారు.

### కండిషన్లో లేకుంటే చర్యలు



స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాం. అన్ని సక్రమంగా ఉంటేనే ధ్రువీకరణ పత్రం జారీ చేస్తాం.ఫిట్‌నెస్ లేకపోతే ఎట్టి పరిస్థితుల్లోనూ బస్సును రోడ్డుపై తిరగనివ్వం. ఫిట్‌నెస్ పరీక్ష చేయించకుండా బస్సు నడిపితే కేసులు నమోదు చేస్తాం లైసెన్స్ ఉన్న డ్రైవర్‌తోనే బండి నడిపించాలి.

– మీరా ప్రసాద్, జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ వైయస్ఆర్ జిల్లా

### ఫిట్‌నెస్ పరీక్షలు ఇలా...



- బస్సును మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ స్వయంగా డ్రైవ్ చేయాలి.
- మరమ్మతులను గుర్తించాలి.
- బ్రేకులు క్లచ్ స్టీరింగ్ హ్యాండ్ బ్రేక్ బ్యాటరీ ఇంజన్ వంటివి పరిశీలించాలి.
- అత్యవసర ద్వారాలు కిటికీలు టైర్లు సీట్లను పరిశీలించి సంతృప్తి చెందిన తర్వాతే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు.

ప్రస్తుతం ఇవన్నీ చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి

### నిబంధనలు ఇలా...



- డ్రైవర్ కు 60 ఏళ్లలోపు వయసు ఉండాలి. ఐదేళ్ల అనుభవంతో కూడిన భారీ వాహన లైసెన్స్ తప్పనిసరి.
- ఆరోగ్యంగా ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం సమర్పించాలి.
- డ్రైవర్ సహాయకుడు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలి. వేగంగా.. నిర్లక్ష్యంగా బస్సు నడపరాదు.
- బస్సులో ప్రథమ చికిత్స బాక్స్ ఉండాలి
- విద్యార్థులు ఎక్కేందుకు ఆధారంగా బస్సుకు రెండు వైపులా ఇనుప కడ్డీలు ఉండాలి. వాహనం ముందు భాగంలో పాఠశాల పేరు చిరునామా ఫోన్ నెంబర్ తప్పనిసరి.

### భవిష్యత్తును చిదిమేసింది..



చిన్నారి మృతదేహం వద్ద విలపిస్తున్న తాత(ఫైల్)

ఓబులవారిపల్లె : వేకువ జామున నిద్రలేచి హడావిడిగా పుస్తకాలు సర్ది.. తన గారాల పట్టిని ముస్తాబు చేసి స్కూల్ వ్యాన్‌లో కూర్చోబెట్టి టాటా చెప్పి మురిసిపోయిన ఆ తల్లి ఆనందం క్షణాల్లో ఆవిరైపోయింది. వ్యాన్ బయలు దేరిన ఐదు నిమిషాలకే తన బిడ్డ తనువు చాలించిందనే పిడుగుపాటు లాంటి వార్త ఆ తల్లి గుండెను పిండేసింది. ఓబులవారిపల్లె మండల కేంద్రానికి చెందిన వీరంరెడ్డి మధుసూధన్‌రెడ్డి, అరుణ దంపతులకు తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. కుమార్తె భవిష్య(07), ఏడాది వయసున్న కుమారుడు వీరం రెడ్డి మోక్షజ్ఞ సాయికుమార్‌రెడ్డి ఉన్నారు. భవిష్య చిన్నఓరంపాడు అయ్యలరాజుపల్లె శ్రీవాణి హైస్కూల్‌లో రెండో తరగతి చదువుతోంది. ప్రతి రోజు మాదిరిగా సోమవారం ఉదయం పాఠశాలకు వ్యాన్‌లో బయలు దేరింది. పాఠశాల సమీపంలో వ్యాన్ బోల్తా పడిన ఘటనలో భవిష్య అక్కడికక్కడే మృతి చెందింది. వ్యాన్ డ్రైవర్ సెల్‌ఫోన్ చూస్తూ నిర్లక్ష్యంగా వాహనం నడపడం, కాలం చెల్లిన బస్సులతోనే తమ బిడ్డను బలిగొన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు వేడుకుంటున్నారు.

## స్టాఫ్ నర్స్‌ల నియామకానికి కౌన్సెలింగ్ ప్రారంభం

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్‌ల నియామకాల కౌన్సెలింగ్ ప్రారంభమయ్యాయి. పులివెందుల, మదనపల్లె, ఆదోని మెడికల్ కాలేజీల్లో మొత్తం 206 మందిని ఈ నియామకాల ద్వారా భర్తీ చేస్తారు. అందులో భాగంగా తొలి రోజు మంగళవారం ఎంపికైన 50 మంది అభ్యర్థులకు గాను 34 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ వై. శ్రీనివాసులు మాట్లాడుతూ 5వ విడత కౌన్సెలింగ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. రోజుకు 50 మంది చొప్పున నియామకాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆ మేరకు ఈ నెల 14, 16, 17వ తేదీల్లో మొత్తం ఎంపికైన అభ్యర్థులకు కౌన్సెలింగ్ ద్వారా నియామకాలు చేపడతామని అన్నారు. ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ భక్త వత్సలం, సూపరింటెండెంట్ గోపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్స్ అతావుల్లా, బత్తనయ్య, రవికుమార్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆర్డీ శ్రీనివాసులు

## మురిసిన మువ్వన్నెల పతాకం



జయహో.. భారత్ నినాదాలు చేస్తున్న వీసీ, అధ్యాపకులు

వైవీయూ: స్వాతంత్ర్య దినోత్సవాలలో భాగంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవం సందర్భంగా యోగివేమన విశ్వవిద్యాలయంలో మెగా ఈవెంట్ ర్యాలీ (ఫ్లాగ్ మార్చ్) నిర్వహించారు. ఫ్లాగ్ మార్చ్‌ను విశ్వ విద్యాలయ వీసీ కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలసి ప్రారంభించారు. స్పోర్ట్స్ సైన్సు శాఖ సహ ఆచార్యులు డాక్టర్ కొవ్వూరు రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో 350 అడుగుల పొడవైన మువన్నెల జాతీయ జెండాను విద్యార్థులు చేతబూని ముందుకు కదిలారు. భారత మాతాకు జై.. వందే మాతరం.. జై జవాన్ జై కిసాన్ అనే నినాదాలతో విశ్వవిద్యాలయం హోరెత్తింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య పుత్తా పద్మ, అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## బీటెక్ 6వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం ప్రొద్దుటూరు వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ 6వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వీసీ కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎస్. ఈశ్వర్ రెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జయరాంరెడ్డితో కలిసి విడుదల చేశారు. సివిల్ ఇంజనీరింగ్(86.36శాతం), కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(100 శాతం), ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (88.89 శాతం), ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ (100 శాతం),మెకానికల్ ఇంజనీరింగ్ (75శాతం) ఫలితాలు వచ్చాయని వీసీ వివరించారు. వైవీయూ ఇంజనీరింగ్ కళాశాల డీన్ ఆచార్య రమణయ్య పాల్గొన్నారు.



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ, అధికారులు

# కృష్ణా జలాలపై నిర్లక్ష్యమేల ?

- ఉన్నతాధికారులకు కొరవడిన ముందుచూపు
- జిల్లాలో 80 టీఎంసీలు నిల్వ చేసుకునే అవకాశానికి గండి
- గండికోటకు తడబడుతూ చేరుతున్న కృష్ణమ్మ



గండికోట ప్రాజెక్టులోకి వస్తున్న వరద జలాలు

సాక్షి ప్రతినిధి,కడప: సాగునీటి శాఖ అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారుతోందా? జిల్లాలోని ప్రాజెక్టులను నీటితో నిండుగా నింపే అవకాశాన్ని చేజారుస్తున్నారా?అంటే.. అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. ఫలితంగా బిరబిరా పరుగులు పెట్టాల్సిన కృష్ణమ్మ.. తడబడుతూ సాగుతోంది.

శ్రీశైలం రిజర్వాయర్‌కు ఈ సారి వరద పోటెత్తింది. ఒకానొక దశలో 4లక్షల క్యూసెక్కులకు చేరింది. ప్రస్తుతం రోజుకు 80వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. అంతకంటే అధికంగా ఔట్‌ఫ్లో ఉండిపోయింది. తెలంగాణ, ఏపీ అధికారులు పోటాపోటీగా విద్యుత్ ఉత్పత్తి చేస్తుండడంతో నీటి నిల్వలు వేగంగా తరుగుతున్నాయి. చాలా వేగంగా నిండిన రిజర్వాయర్ అంతే స్పీడ్‌గా ఖాళీ అవుతోంది. తాజాగా 198 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

**సీమకు శ్రీశైలం ప్రాజెక్టే దిక్కు..**

రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు శ్రీశైలం రిజర్వాయర్ మాత్రమే ఏకైక ఆధారం. అందులో నీరు నిల్వ ఉన్నప్పుడు, వరద జలాలు ఉధృతంగా ఉన్నప్పుడు తక్షణ స్పందన ఉంటేనే సకాలంలో ఎగువ భాగంలో ఉన్న రాయలసీమ ప్రాజెక్టులకు నీరు అందుతుంది. ప్రస్తుతం అవుకు జలాశయం నుంచి 13వేల క్యూసెక్కులు నీరు డ్రా చేస్తుంటే గండికోటకు 11,800 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. 20వేల క్యూసెక్కులు డ్రా చేసుకునే వెసులుబాటు ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు ఆ స్థాయిలో నీరు ఇవ్వడం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికీ కేవలం 4టీఎంసీల నీరు మాత్రమే గండికోటలో నిల్వ ఉంది. మరో మూడు వారాలు ఇదే స్థాయిలో నీరు లభిస్తే తప్పా గండికోట నిండే అవకాశం లేదు. గండికోట నిండితే, పైడిపాళెం, చిత్రావతి రిజర్వాయర్లు నింపుకునే వెసులుబాటు ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో కర్నూల్ జిల్లా నీటిపారుదల శాఖ కర్నాటకలోని కోయ, ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నీటి సామర్థ్యాన్ని అంచనా వేసి, శ్రీశైలం ప్రాజెక్టుకు చేరుతోన్న నీటిని పరిగణలోకి తీసుకొని రాయలసీమ ప్రాజెక్టులను నింపే చర్యలు చేపట్టాల్సి ఉంది. ఈ ప్రాంతంపై మక్కువ ఉన్న ప్రజాప్రతినిధులు, చిత్తశుద్ధి ఉన్న అధికారులు ఉన్నప్పుడే అది సాధ్యం అవుతుంది. లేదంటే నోరు వెళ్లబెట్టుకోవాల్సిన దుస్థితే వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తెలుగుగంగకు నీరు....**

వెలుగోడు ప్రాజెక్టు నుంచి తెలుగుగంగ ప్రాజెక్టుకు 13వేల క్యూసెక్కుల నీరు ప్రభుత్వం విడుదల చేసింది. ఎస్ఆర్-1, ఎస్ఆర్-2 నిండిన తర్వాత ఈనెల 17నుంచి బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌కు చేరనున్నాయి. ప్రస్తుతం 2500 క్యూసెక్కులు చొప్పున ఎస్ఆర్-1,2 రిజర్వాయర్లుకు చేరుతున్నాయి. ఇప్పటికే ఎస్సార్-1 సగ భాగం నిండింది. పూర్తి సామర్థ్యంతో ఎస్సార్-1,2 నిండిన తర్వాతే బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌కు నీరు చేరనుంది. కాగా జిల్లాలో 92వేల ఎకరాలు ఆయకట్టుగా ఉన్న కేసీ కెనాల్‌కు ప్రణాళిక బద్ధంగా నీరు విడుదల చేయనున్నారు. కాగా, ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట నుంచి పెన్నాకు ఓవర్ ఫ్లో అవుతోన్నా, కేసీ కెనాల్‌కు తద్వారా పాతకడప చెరువుకు నీరు నింపాలన్న స్పృహ కూడా అధికారులకు లోపించిందని రైతులు వాపోతున్నారు. మొత్తంపైన జిల్లాలో 82టీఎంసీలు నీరు నిల్వ చేసుకునే అవకాశం ఉంది. వనరులను సద్వినియోగం చేసుకోవడంలో జిల్లాలోని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు చొరవ చూపాల్సిన ఆవశ్యకత ఉంది.

**• జిల్లాలోని ప్రాజెక్టుల వివరాలు**

| ప్రాజెక్టు పేరు | నీరు నిల్వ సామర్థ్యం (టీఎంసీ) | ప్రస్తుతం ఉన్న నీరు (టీఎంసీ) |
|---|---|---|
| ఎస్సార్-1 | 2.134 | 1.31 |
| ఎస్సార్-2 | 4.477 | 0.265 |
| బ్రహ్మంసాగర్ | 17.735 | 2.0 |
| గండికోట | 26.850 | 3.89 |
| మైలవరం | 6.5 | 0.9 |
| వామికొండ | 1.66 | 0.363 |
| సర్వారాయసాగర్ | 3.06 | 0.308 |
| చిత్రావతి | 10.229 | 3.275 |
| పైడిపాళెం | 6.0 | 3.363 |
| వెలుగల్లు | 4.64 | 2.68 |
| ఫించా | 0.327 | 0.026 |
| బుగ్గవంక | 0.506 | 0.051 |

### వరద ఉన్నప్పుడే సద్వినియోగం చేసుకోవాలి



శ్రీశైలం ప్రాజెక్టులో వరద జలాలు పుష్కలంగా ఉన్నప్పుడు రాయలసీమ ప్రాజెక్టులను నింపాలి. ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణం స్పందన చూపాలి. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ప్రధాన వనరు కావడంతో 854 అడుగులకు రాగానే, నీరు డ్రా చేసేందుకు చొరవ చూపాలి. ఈ విషయంలో పాతతరం నాయకులు ప్రత్యేక చొరవ చూపెట్టేవారు. ఇకనైనా ఆ దిశగా చర్యలుంటే సంతోషకరం.

– సీహెచ్ చంద్రశేఖరరెడ్డి, అధ్యక్షుడు, రాయలసీమ కార్మిక, కర్షక సమితి

### టీజీపీకి నీరు వైఎస్ జగన్ ప్రత్యేక చొరవే కారణం



తెలుగుగంగ కెనాల్‌కు నీరు వస్తోందంటే వైఎస్ జగన్ చొరవే కారణం. అప్పట్లో ప్రధాన ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంతో 0-18 కిలోమీటర్లు వరకూ ప్రధాన కాలువ పనులకు టెండర్లు పిలిచి సత్వరమే పనులు చేపట్టారు. కాగా ప్రస్తుత ప్రభుత్వం వెలుగోడు ప్రాజెక్టుకు ముందే నీరు నింపింటే ఇంకా ముందుగా నీరు లభించేది.

– రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, రైతు ఉద్యమనేత, మైదుకూరు.

## మేకను ఎత్తుకెళ్లిన చిరుత

ముద్దనూరు : ముద్దనూరు-జమ్మలమడుగు ఘాట్ రోడ్డులో చిరుత పులి మేకలమందపై దాడిచేసి ఓ మేకపిల్ల, కాపలాగా ఉన్న ఓ కుక్కను ఎత్తుకెళ్లింది. సోమవారం సాయంత్రం స్థానిక మునయ్య కోన పరిసరప్రాంతంలో మండలంలోని చెన్నారెడ్డిపల్లెకు చెందిన ఓ వ్యక్తి జీవాల మందకు కాపాల కాస్తున్నాడు. అకస్మాత్తుగా చిరుత మందపై దాడి చేసి మేకపిల్లను ఎత్తికెళ్లిందని ప్రత్యక్షసాక్షి తెలిపారు. మేకల మందలకు కాపలాగా ఉన్న కుక్క చిరుత మీదకు వెళ్లగా కుక్కను కూడా ఎత్తుకెళ్లిందని పేర్కొన్నారు . 3 రోజులగా ఘాట్ రోడ్డులో చిరుత సంచరిస్తున్నట్లు పలువురు బాటసారులు తెలిపారు. మేకల మందపై చిరుత దాడిచేయడంతో నిత్యం రద్దీగా ఉండే ముద్దనూరు -జమ్మలమడుగు రహదారిలో సంచరించేవారు భయాందోళనకు గురవుతున్నారు.

### కొమ్మ ముడిపడింది.. ఐక్యత చాటుతోంది






ప్రకృతిలో ఎన్నో వింతలు చూస్తుంటాం. చేతులు కట్టినట్లు కనిపించే ఈ చెట్టు ఐక్యతను గుర్తు చేస్తోంది. బి.కొత్తకోట మండలం పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్‌పై అటవీశాఖ ప్రాంగణంలోని ఈ చెట్ల కలయిక కనిపించింది. జకరండగా పిలువబడే ఈ చెట్లు కొండపై అధికంగా కనిపిస్తాయి. ఇవి వేర్వేరుగా ఎదుగుతూ పైకి ఎగబాకాయి. ఆ క్రమంలో రెండు చెట్ల కొమ్మలు ఒకదానికొకటి అతుక్కుపోయి..పెద్ద కొమ్మగా ఎదిగింది. ఈ చెట్ల విశేషాన్ని తిలకించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు.

– బి.కొత్తకోట

### అద్దం పగిలింది.. పోస్టర్ అడ్డుపడింది




కుయ్ కుయ్‌మంటూ వచ్చే 108 వాహనం చూస్తే అంబులెన్స్ అని ఇట్టే అర్థమవుతుంది. మరి ఇదేమిటి.. ఈ వాహనంపై టీ కాఫీ టిఫిన్ అని ఆశ్చర్యంగా చూస్తున్నారా.. అవును నిజమే క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించే 108 వాహనం దుస్థితి ఇదీ. ఈ వాహనం మొత్తం పాడైపోయింది. దీంతో వర్షాలు కురిస్తే చాలు తడిసి ముద్దవుతోంది. సిబ్బంది వాటి నుంచి రక్షణ కోసం ఇదిగో ఇలా టీ.. కాఫీ. టిఫిన్ బోర్డు అడ్డంగా పెట్టేసి తడవకుండా రక్షణ పొందుతున్నారు.

– వాల్మీకిపురం

### పట్టు తప్పితే.. ప్రాణం పోతుంది



ఒకరిని చూసి మరొకరు.. సరదా అనుకుంటే.. ప్రాణ మీదుకు తెచ్చుకున్నట్లే. విద్యుత్తు స్తంభంతో ఈ చిన్నారులు ప్రయాణంలో ఇలా ఆడుకోవాలనుకుంటే కిందపడి ప్రాణం పోతుంది. పులివెందుల మండలంలో ఇలా ప్రమాదకరంగా ఓ ట్రాక్టర్‌లో విద్యుత్ స్థంభాలపై యువకులు, పిల్లలు కూర్చొని ప్రయాణం చేస్తున్నారు. ఏ మాత్రం పట్టు తప్పినా.. కింద పడిపోతారు. అధికారులు ఇలాంటి ప్రయాణం చేయకుండా కాపాడాల్సిన అవసరం ఉంది.

– పులివెందుల రూరల్

## క్లుప్తంగా

### చిన్నారికి డెంగీ



ఇంటింటి సర్వే చేస్తున్న జిల్లా మలేరియా అధికారిణి మనోరమ

కమలాపురం : కమలాపురం పట్టణం తూర్పు గండ్లూరు కాలనీలో తొమ్మిదేళ్ల బాలిక పట్నం శిరీషకు డెంగీ నిర్ధారణ అయినట్లు జిల్లా మలేరియా అధికారిణి మనోరమ తెలిపారు. తూర్పుగండ్లూరు కాలనీలో మంగళవారం ఇంటింటా సర్వే చేశారు. నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. రాత్రిళ్లు దోమ తెరలు వాడాలని స్థానికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ రాముడు, పంచాయతీ సెక్రటరి ప్రణీత్‌కుమార్‌రెడ్డి, ప్రసాద్, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

### రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

ఎర్రగుంట్ల : మండలంలోని కలమల్ల పరిధిలోని ఐపీఎస్ఆర్ పెట్రోల్ బంకు సమీపంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్ఐ తిమోతి మంగళవారం పట్టుకుని సీజ్ చేశారు. ఇద్దరు వాహన డ్రైవర్లు, ట్రాక్టరు యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

### స్కూటీలో నగదు చోరీ

వేంపల్లె : పట్టణంలోని సాయిబాబా ఆలయం సమీపంలో పార్క్ చేసిన స్కూటీలో నగదు మంగళవారం చోరీకి గురైంది. బాధితుడి వివరాల మేరకు.. వేంపల్లె పట్టణానికి చెందిన కె.రామచంద్రారెడ్డి బ్యాంకులో బంగారు నగలు పెట్టి రుణం తీసుకున్నారు. తిరిగి చెల్లించేందుకు డబ్బు తీసుకుని బ్యాంకుకు వెళ్లారు. డబ్బు కట్టిన అనంతరం మిగిలిన రూ.30 వేల మొత్తాన్ని సంచిలో పెట్టి స్కూటీ సీటు కింద పెట్టారు. అక్కడి నుంచి నేరుగా సాయిబాబా ఆలయం సమీపంలో దుకాణం వద్ద పెరుగు ప్యాకెట్ కొనేందుకు స్కూటీని పార్క్ చేశారు. తిరిగి వచ్చేలోపు గుర్తుతెలియని వ్యక్తులు డబ్బు అపహరించినట్లు బాధితుడు వాపోయారు. డబ్బుతోపాటు రేషన్, ఆధార్‌కార్డులు ఉన్నాయని బాధితుడు మంగళవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# బాబోయ్.. కాపర్ దొంగలు

- పొలాల్లో కాపు కాచి పట్టేసుకున్న రైతులు
- పోలీసులకు ఐదుగురు దొంగల అప్పగింత
- పాత ఇనుప సామగ్రి అమ్మే వ్యక్తే కీలకం



తుడుమలదిన్నెలో అనుమానితులను పట్టుకున్న గ్రామస్థులు

ఖాజీపేట : పొలాల్లో రాత్రిళ్లు కాపర్ వైర్ చోరీ చేసి రైతులకు తీరని నష్టం మిగుల్చుతున్న కొందరు దొంగలు రైతుల చేతికి చిక్కారు. గత కొద్దిరోజులుగా పొలాల్లోని మోటార్ల వద్ద కాపర్ వైర్ చోరీకి గురికావడం తెలిసిందే. ఈ నేపథ్యంలో మండలంలోని తుడుమలదిన్నె గ్రామంలో రాత్రి కాపు కాచిన రైతులు చోరీకి పాల్పడుతున్న ఐదుగురు దొంగలను పట్టి పోలీసులకు అప్పగించారు. రైతుల వివరాల మేరకు.. ఖాజీపేట మండలంలో నెల వ్యవధిలోనే రైతుల పొలాల్లో మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లలో అమర్చిన కాపర్ తీగల చోరీ ఘటనలు దాదాపు 50కి పైగా జరిగాయి. దీనికి తోడు ఖాజీపేట టౌన్‌లోని ఆరు దుకాణాలు, రెండిళ్లలో చోరీలు చోటు చేసుకోవడం, ఎస్‌బీఐ ఏటీఎం చోరీ యత్నం చేయడం ఈ వారంలోనే చోటుచేసుకున్నాయి. మండలంలోని తుడుమలదిన్నెలో అధికంగా మోటార్ల చోరీ ఘటనలు జరిగాయి. పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో రైతులు అప్రమత్తమయ్యారు. దొంగలను పట్టుకోవాలని.. గ్రామస్థులు స్వయంగా పొలాల్లో కాపు కాచారు. మంగళవారం తెల్లవారుజామున ప్రధాన రహదారిలోని పొలం వద్ద ఐదుగురు తచ్చాడుతూ కనిపించారు. వెంటనే గ్రామస్థులంతా ఏకమై వారిని పట్టుకున్నారు. వారి నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్ ఫోన్లు, తీగలు కట్‌చేసే కట్టర్లు, టెస్టర్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు సమాచారం వచ్చి ఐదుగురినీ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

**ఇనుప సామాన్ల విక్రేత కీలకం**

ఖాజీపేట మండలంలో ఇటీవల కాపర్ వైర్ల చోరీ ఘటనలు పెరిగాయి. యథేచ్ఛగా దొంగలు తీగలు కోసి తీసుకెళ్తున్నారు. ఆరుగాలం కష్టపడిన రైతు పండించిన పంట నష్టపోకూడదనే నెపంతో మళ్లీ మోటారు పైకి తీసి కొత్త కాపర్ వైర్ చుట్టి సిద్ధం చేసేందుకు రూ.5 వేల నుంచి రూ.6 వేలు ఖర్చు చేస్తున్నారు. మెకానిక్ స్పందించకపోతే పొలం ఎండిపోయే పరిస్థితి. కాపర్ తీగ చోరీ చేసిన వారు మాత్రం అప్పనంగా జేబులు నింపుకొంటున్నారు. కిలో కాపర్ తీగకు కొనుగోలు దారులు రూ.300 ఇచ్చి.. బయట ప్రాంతాల్లో రూ.600కు విక్రయిస్తున్నారు. మండలంలో ఇనుప సామగ్రి విక్రయించే ఓ వ్యక్తి ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిసింది.



కట్ అయిన మోటారు తీగలు

**చోరీలపై లోతైన విచారణ**

ఖాజీపేట మండలంలో జరుగుతున్న చోరీలపై పోలీసులు లోతైన విచారణ జరుపుతున్నారు. మోడల్ స్కూల్ వద్ద అనుమానితుడిగా ఉన్న ఓ వ్యక్తి గతంలో ఎస్ఐపై దాడికి యత్నించారు. ప్రస్తుతం అతడితోపాటురైతులు అప్పగించిన ఐదుగురినీ విచారిస్తున్నారు. ఎప్పటి నుంచి చోరీలు చేస్తున్నారు? తెర వెనుక ఎవ్వరున్నారు? ఎవ్వరికి అమ్ముతున్నారు? అనే కోణాల్లో విచారణ జరుపుతున్నారు.

**దొంగలపై కఠినంగా వ్యవహరించాలి**



నా పొలంలో మోటారు చోరీకి గురైంది.. నాతోపాటు మరింతమంది రైతుల మోటార్లు పోయాయి.. పాత సామగ్రి అమ్మే వ్యక్తి వద్ద మోటారు కొందామని వెళ్లే అక్కడ నా మోటారు ఉన్నట్లు గుర్తించా.. నీకు ఈ మోటారు ఎవ్వరిచ్చారు అని అడిగితే సరైన సమాధానం లేదు. ఇదే విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశా.

- రెడ్డేరి శ్రీనివాసులురెడ్డి, రైతు, కూనవారిపల్లె

**ఐదుగురిని పట్టుకుని పోలీసులకు అప్పగించాం**



మా గ్రామంలో కేవలం నెల వ్యవధిలోనే 20కిపైగా చోరీలు జరిగాయి. రేయింబవళ్లు కాపు కాచారం. మంగళవారం తెల్లవారుజామున మోటార్లు చోరీ చేసే ఐదుగురిని పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించాం.. రైతులను ఇబ్బందులకు గురిచేసే వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరించి మాకు న్యాయం చేయాలి.

- కొత్తపల్లె కృష్ణారెడ్డి, తుడుమలదిన్నె సర్పంచ్

**పంటకు నీరందించలేక ఇబ్బంది పడుతున్నాం**

మా పొలంలో సాగు చేసిన పంటకు నీరందించలేక ఇబ్బంది పడుతున్నాం. ఈ సమయంలో పది రోజుల కిందట మోటారుకు కాపర్ తీగ చోరీ చేశారు. తిరిగి బిగించుకునేందుకు చాలా ఇబ్బందిపడ్డాను. సుమారు రూ.5 వేల నుంచి రూ.6వేలు ఖర్చు అవుతోంది. పెట్టుబడులు పెరిగి రైతులు సతమతమవుతుంటే. ఇపుడు దొంగలు మోటార్లు చోరీ చేయడంతో మరింత నష్టపోతున్నారు. దొంగలను గుర్తించి వారిపై కఠినంగా వ్యవహరించాలి.

- వర్రా నరసింహులు, రైతు, తుడుమలదిన్నె గ్రామం

### వలంటీర్లకు న్యాయం చేయాలని వినతి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : వలంటీర్లకు ఈ నెల 15వ తేదీలోగా శుభవార్త చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ వలంటీర్లకు న్యాయం చేసి రెండు నెలల గౌరవ వేతనాన్ని మంజూరు చేయించాలని, రాజీనామా చేసిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సీఎం, డిప్యూటీ సీఎం, మున్సిపల్, సాంఘిక సంక్షేమం, విద్యా శాఖల మంత్రులకు మెయిల్ ద్వారా లేఖలు పంపినట్లు తెలిపారు. వలంటీర్లకు రూ.10వేల జీతం ఇవ్వడమేగాక, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని తక్షణమే అమలుచేయాలన్నారు.

### గుర్తు తెలియని సాధువు మృతి



ముద్దనూరు : స్థానిక పాత బస్టాండు ఆవరణలో మంగళవారం సాయంత్రం గుర్తుతెలియని సాధువు మృతి చెందారు. గత కొద్ది నెలలుగా భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న సాధువు అనారోగ్యంతో మృతి చెందినట్లు, ఇతని ఆనవాళ్ళు ఏమీ లభించలేదని పోలీసులు తెలిపారు. మృతి చెందిన సాధువు మృత దేహాన్ని స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బందికి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

## అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు



గండి అంజన్న సన్నిధిలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

పులివెందుల రూరల్ : అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనపై ఉక్కుపాదం మోపినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. పులివెందులలోని అర్బన్, రూరల్ పోలీస్ స్టేషన్లను మంగళవారం ఆయన తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ మట్కా, జూదం, క్రికెట్ బెట్టింగ్, గంజాయి వంటి అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని కోరారు. పులివెందులలోని రింగురోడ్డు, పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

**గండి అంజన్న సన్నిధిలో ఎస్పీ**

చక్రాయపేట: జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మంగళవారం సాయంత్రం గండి వీరాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది ఆయనచే ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఎస్పీ చక్రాయపేట పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం భారతీయ న్యాయ సంహిత చట్టానికి సంబంధించిన రికార్డుల నిర్వహణపై సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పులివెందుల డీఎస్పీ మురళి, ఆర్కే వ్యాలీ సీఐ గోవిందరెడ్డి, ఎస్సై కృష్ణయ్య పాల్గొన్నారు.

**పోలీస్ స్టేషన్ తనిఖీ**

వేంపల్లె : వేంపల్లె పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా నడుచు కోవాలని, స్టేషన్ ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ సురేష్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆలయ భూముల కబ్జాపై పోలీసులకు ఫిర్యాదు

మైదుకూరు : మైదుకూరు పట్టణంలోని లక్ష్మీ.మాధవ స్వామి ఆలయ భూములను కొందరు చదును చేయడంపై మంగళవారం దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ఎంఎస్.ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని ఎస్.మైదుకూరు రెవెన్యూ పొలం సర్వే నంబర్ 1845/1, 2, 3, 4, 5లోని 10.20 ఎకరాల భూమిని కొందరు వ్యాపారులు వెంచర్లు వేసేందుకు చదును చేశారు. ఈ విషయంపై మాజీ సర్పంచ్ చొక్కం రమేష్ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం లక్ష్మీ మాధవ, ఆంజనేయ స్వామి, భీమేశ్వరస్వామి సమూహ దేవ స్థానముల ఈవో ప్రసాద్ పరిశీలించి స్థానిక అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్రమంగా చదును చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

### జిల్లాలో సీఐల బదిలీలు

కడప అర్బన్ : కర్నూలు రేంజ్ పరిధిలోని వైఎస్ఆర్ జిల్లాలో సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు.

| సీఐ పేరు | బదిలీ స్టేషన్ |
|---|---|
| బి. నాగార్జున | కడప టూటౌన్ పీఎస్ |
| జి. ఇబ్రహీం | సీసీఎస్, కర్నూలు |
| ఎన్.వెంకటనాగరాజు | కడప తాలూకా పీఎస్ |
| పి. రాజా | వి.ఆర్, ఎస్పీ కడప |
| ఆర్.పురుషోత్తంరాజు | చెన్నూరు పిఎస్ |
| ఎం. పార్థసారథి | వి.ఆర్, ఎస్పీ, కడప |
| డి. శ్రీనివాసులు | పోరుమామిళ్ల సర్కిల్ |
| బాలమద్దిలేటి | ప్రొద్దుటూరు రూరల్ |
| కె. రమణారెడ్డి | విఆర్, ఎస్పీ, కడప |
| టి. నారాయణ యాదవ్ | జమ్మలమడుగు |
| ఎం. కరుణాకర్ | విఆర్, ఎస్పీ కడప |
| ఎన్. వెంకటరమణ | పులివెందుల |
| ఎస్. లింగప్ప | పులివెందుల రూరల్ |
| వి. నాగరాజు | ఆర్.కె వ్యాలీ, కడప |
| సయ్యద్ హాసం | మైదుకూరు అర్బన్ |
| ఏ.పి. మస్తాన్ | వి.ఆర్ ఎస్పీ, కడప |
| ఆర్.మోహన్ | ఖాజీపేట |
| కె. రామచంద్ర | మదనపల్లె టూటౌన్ |
| కె. ఎల్లంరాజు | రైల్వేకోడూరు |
| ఎం. శ్రీనాథరెడ్డి | డిఎస్‌బి-2,కర్నూలు |
| డి.హాజీవల్లీ | పులివెందుల ట్రాఫిక్ |
| సి. భాస్కర్‌రెడ్డి | డిసిఆర్‌బి, కడప |
| బి. రాజాప్రభాకర్ | విఆర్‌ఎస్పీ,కడప |
| డి.కె జావీద్ | కడప ట్రాఫిక్ పిఎస్ |

## విశాఖ బ్యాట్స్‌మన్ జోరు



ఈశ్వర్ రిత్విక్ (182 పరుగులు)



రేవంత్ నాగకుమార్ (121 పరుగులు)



యవన్ (95 పరుగులు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విశాఖ పట్నం, కృష్ణా జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన విశాఖ జట్టు బ్యాటింగ్ ఎంచుకుని తొలిరోజు ఆట ముగిసే సమయానికి 89.5 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 356 పరుగులు చేసింది. జట్టులోని జి.ఈశ్వర్ రిత్విక్ 294 బంతుల్లో 18 ఫోర్లు, ఏడు సిక్సర్లతో 182 పరుగులు చేశారు. ఈయనకు జతగా యువన్ 95 పరుగులు చేశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

**కేఓఆర్‌ఎం మైదానంలో..**

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో పశ్చిమగోదావరి, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 29 ఓవర్లలో 122 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని మన్విత్‌రెడ్డి 59 పరుగులు చేశాడు. పశ్చిమగోదావరి బౌలర్లు యశ్వంత్ 3, రేవంత్ నాగకుమార్ 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమగోదావరి జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 60 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 268 పరుగులు చేసింది. జట్టులోని రేవంత్ నాగకుమార్ 161 బంతుల్లో 12 ఫోర్లు, 6 సిక్సర్‌లతో 121 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. ఈయనకు జతగా రక్షణ్ 76 పరుగులు చేశాడు. దీంతో పశ్చిమగోదావరి జట్టు 146 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

**కేఎస్ఆర్‌ఎం మైదానంలో..**

కేఎస్ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 91 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 293 పరుగులు చేసింది. జట్టులోని చరణ్‌జీత్ 66 పరుగులు, లోహిత్ లక్ష్మినారాయణ 53 పరుగులు చేశారు. కడప బౌలర్లు నాగకుల్లాయప్ప 3 వికెట్లు, హ్రితిక్ కుమార్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.



### మార్చురీ సిబ్బంది నిర్లక్ష్యం

అర్ధరాత్రి రహదారిపై మృతుడి బంధువుల ఆందోళన



మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి నిరసన తెలుపుతున్న బాధితులు

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రి మార్చురీ సిబ్బంది తీరును నిరసిస్తూ అర్ధరాత్రి మృతుడి బంధువులు రోడ్డుపై బైఠాయించారు. చాపాడు మండలం వెదురూరు గ్రామానికి చెందిన గంగరాజు సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల సూచన మేరకు పోస్టుమార్టం నిమిత్తం కుటుంబసభ్యులు రాత్రి 11.30 సమయంలో మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీ వద్దకు తీసుకొచ్చారు. మార్చురీ గదికి తాళం వేసి ఉండటంతో క్యాజువాలిటిలోని వైద్యాధికారులను అడిగారు. అయితే వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. ఎవరిని అడిగినా తాళం ఎక్కడుందో తెలియదని సమాధానం చెప్పారు. సుమారు గంటన్నరపాటు అందరినీ అడిగి విసిగిపోయిన మృతుడి బంధువులు చేసేదేమి లేక మృతదేహాన్ని రోడ్డుపైన పెట్టి ఆందోళన చేశారు. కొద్దిసేపటి తర్వాత పోలీసులు తాళం తీసుకురావడంతో మృతదేహాన్ని మార్చురీలోని ఫ్రీజర్ బాక్స్‌లో పెట్టారు. ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారని మృతుడి బంధువులు ఆరోపించారు.

### 16 మంది జూదరుల అరెస్టు

ముద్దనూరు : మండలంలోని యామవరం శివారులోని ఓ తోటలో పేకాట స్థావరాలపై కడప ఎస్‌బీ అధికారులు, కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ, ఎస్ఐలు విద్యాసాగర్, మైనుద్దీన్ మంగళవారం దాడులు నిర్వహించారు. ఇటీవల సంచారం జూదం శీర్షికన సాక్షిలో వార్తా కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో దాడులు నిర్వహించిన పోలీసులు 16 మంది జూదరులను అరెస్టు చేశారు. పట్టుబడిన వారిలో కూటమి నేత ఒకరు వున్నట్లు సమాచారం. వారి నుంచి రూ.2,25,380ల నగదు, రెండు కార్లు, మూడు మోటార్ బైక్‌లు, 13 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నగదుకు బదులుగా వినియోగించే కాయిన్స్ పట్టుబడినట్లు సమాచారం. జూదరులలో చాలామంది యర్రగుంట్ల, ప్రొద్దుటూరు మండలాలకు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పేదలపై కూటమి కక్ష సాధింపు

ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి



మాట్లాడుతున్న గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : రాష్ట్రంలో పేదలపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి అన్నారు. విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ అసైన్డ్ భూముల్లో గత 20 ఏళ్లుగా సాగులో ఉన్న పేదలకు భూమిపై హక్కులు కల్పిస్తూ గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం ఆ అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లు ఆపాలంటూ ఆదేశాలివ్వడం దారుణమని మండిపడ్డారు. అసలైన లబ్ధిదారుల పేరిట మాత్రమే తమ ప్రభుత్వం రిజిస్టర్ చేసి..అమ్ముకునే హక్కు ఇచ్చారని, ఇప్పుడు ప్రభుత్వ నిర్ణయంతో రైతుల పరిస్థితి గందరగోళంగా మారిందని తెలిపారు. ఆ భూములపై అధికార పార్టీ నాయకులు కన్నేశారని, పలుచోట్ల పేదలను బెదిరించి భూములు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నపుడు రైతులకు సెంటు భూమి ఇవ్వలేదని, గత ప్రభుత్వం 42,307 మంది రైతులకు 46,463 ఎకరాల అసైన్డ్ భూములు పంపిణీ చేసిందని తెలిపారు. మేనిఫెస్టో అమలు చేయలేక ప్రజల దృష్టి మళ్లించేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

## ఎస్ఈబీ అదనపు ఎస్పీ బదిలీ



జి. వెంకటరాముడు, ఎస్ఈబి అదనపు ఎస్పీ

కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో (ఎస్ఈబి) అదనపు ఎస్పీగా పని చేస్తున్న జి.వెంకరాముడును ఇంటలిజెన్స్ విభాగానికి బదిలీ అయ్యారు. రాష్ట్రంలో నలుగురు అదనపు ఎస్పీలను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో 2012 బ్యాచ్‌కు చెందిన జి. వెంకట రాముడును ఇంటలిజెన్స్ విభాగానికి బదిలీ చేశారు. ఈయన గతంలో కర్నూలు అదనపు ఎస్పీ(అడ్మిన్)గా పనిచేస్తూ ఎన్నికల ముందు జనవరిలో జిల్లాకు ఎస్ఈబీ అదనపు ఎస్పీగా బదిలీ అయ్యారు. ఇక్కడ ఎన్నికల సమయంలోనూ సమర్థంగా పనిచేసిన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. ఈ క్రమంలోనే ఇంటలిజెన్స్ విభాగానికి బదిలీ అయ్యారు.